## క్లుప్తంగా

### జొన్నలకొత్తపల్లిలో అంధకారం


వెలగని వీధి లైటు

ముదిగుబ్బ: జొన్నల కొత్తపల్లిలో అంధకారం అలుముకుంది. ప్రతి వీధిలోనూ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. అయితే వాటికి ఉన్న లైట్లు పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి అమర్చలేదు. దీంతో రోజూ సాయంత్రం ఆరున్నర గంటలు దాటగానే గ్రామంలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇంటి నుంచి అలా బయటకు రావాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తోంది. విషపురుగులు తిరుగుతుండడంతో వాటి బారిన ఎక్కడ పడతామోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోజూ సాయంత్రం ఆంజనేయస్వామి గుడిలో భజన కార్యక్రమం ఉంటుంది. పలువురు భక్తులు అక్కడికి చీకట్లోనే భయం భయంగా వెళ్లి వస్తున్నారు. మూడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు మార్చి వెలుగులు ప్రసాదించాలని కోరుతున్నారు.

### వరద బాధితులకు దుస్తుల సేకరణ


విజయవాడ పంపేందుకు దుస్తులను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: విజయవాడ వరద బాధితులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (కదిరి ప్రాజెక్టు) ప్రజల నుంచి సేకరించిన దుస్తులను సోమవారం విజయవాడలోని రాష్ట్ర యూనియన్‌కు పంపించారు. ఈ దుస్తులు అక్కడికి చేరిన వెంటనే బాధితులకు అందజేస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, లక్ష్మీదేవి, శారద, సుజాత, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూలో ముగ్గురు బదిలీ

అమడగూరు: రెవెన్యూ కార్యాలయంలో ముగ్గురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. తహసీల్దార్ రామనాథరెడ్డిని నంద్యాలకు, సీనియర్ సహాయకులు శ్రీనివాసరెడ్డిని ఓడీ చెరువుకు, ఆర్ఐ ఈశ్వరయ్యను హిందూపురానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా కదిరి నుంచి రామకృష్ణారెడ్డిని అమడగూరు రెవెన్యూ కార్యాలయ సీనియర్ సహాయకులుగా నియమించారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డికి ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

### 'చెకుముకి' పోస్టర్లు విడుదల

కదిరి అర్బన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను సోమవారం కదిరి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విడుదల చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, 27న జిల్లాస్థాయి, నవంబర్ 9న రాష్ట్రస్థాయి ట్యాలెంట్ టెస్టులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వీరాస్వామి, శివారెడ్డి, అశ్వర్థనారాయణ, సురేష్, హరిప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెలోకి వైద్య సిబ్బంది


సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఎన్ఎంలు

తలుపుల : రాష్ట్ర గ్రామ, వార్డు, సచివాలయ హెల్త్ సెక్రటరీ, ఏఎన్ఎంల అసోసియేషన్ ఆదేశాల మేరకు తలుపుల సచివాలయ వైద్య సిబ్బంది సోమవారం సమ్మెలోకి వెళ్లారు. సచివాలయ ఏఎన్ఎంలు మాట్లాడుతూ ఓ వైపు సచివాలయంలో పనిచేస్తూ, మరో వైపు పీహెచ్‌సీలో పనిచేస్తుండడంతో ఒత్తిడికి గురై అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు శాఖలలో పనిచేయడం ఇబ్బందికరంగా ఉందన్నారు. తమను మాతృ విభాగమైన ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామమోహన్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్‌బాబులకు సమ్మె నోటీసు అందజేశారు.

### రేపు ప్రజా వేదిక

కదిరి అర్బన్: ఎంఈడీఓ కార్యాలయంలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప తెలిపారు. మండలంలోని 14 పంచాయతీల్లో గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ కింద జరిగిన పనులపై ఈ నెల 15 నుంచి 24 వరకు సామాజిక తనిఖీలు నిర్వహించి.. 25న బహిరంగ ప్రజావేదిక కార్యక్రమంలో నివేదిక వివరాలు వెల్లడించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

---

- కదిరి కోనేరు సుందరీకరణ ఎన్నడో?
- ముందుకు సాగని చెర్లోపల్లి నుంచి మంచినీటి సరఫరా
- హంద్రీ–నీవా జలాలతో చెరువులు ఎప్పుడు నింపుతారో?
- వంద రోజుల పాలనలో హామీలపై దృష్టి సారించని ఎమ్మెల్యే కందికుంట




తనను గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కందికుంట ఎన్నికల్లో హామీ ఇచ్చారు. నమ్మిన ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. ఎమ్మెల్యే అయ్యి వంద రోజులు దాటినా పింఛన్ల పెంపు మినహా ఏ ఒక్కటీ నెరవేరలేదు. కనీసం వాటి గురించి మాట్లాడటం కూడా చేయడం లేదు. వచ్చీ రాగానే సంపాదనపైన.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలపైన దృష్టి సారించారు.


అపరిశుభ్రంగా కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరు (ఇన్‌సెట్) ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

# హామీలు.. హాంఫట్

కదిరి: సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి సర్కారు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. నియోజకవర్గ అభివృద్ధి.. సమస్యల పరిష్కారంపై ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూర్తిగా వెనుకబడ్డారు. ప్రసిద్ధ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరును సుందరంగా తీర్చిదిద్దుతానన్న హామీని విస్మరించారు. ఆ ఒక్కటే కాదు చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరికి మంచినీరు సరఫరా చేస్తామన్నారు. ఇప్పటి దాకా అతీగతీ లేదు. పట్టణంలోని రాయలసీమ సర్కిల్ నుంచి కోనేరు సర్కిల్ వరకు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. ఉపాధినిచ్చే పరిశ్రమలను నియోజకవర్గంలో నెలకొల్పుతామని చెప్పినా ఇంతవరకూ ఎటువంటి పురోగతీ లేదు. హంద్రీ–నీవా జలాలతో నియోజకవర్గంలోని ప్రతి చెరువునూ నింపుతామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. కదిరి పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు దాని గురించి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. ఇక బైపాస్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఆచరణలో మాత్రం అది కావడం లేదు.


కుటాగుళ్ల స్టాక్ పాయింట్‌లో తెలుగు తమ్ముళ్లు ఇసుకను ఊడ్చేసిన దృశ్యం

**హామీలు విస్మరించి.. అడ్డగోలు సంపాదన**

ఎన్నికల హామీలను ఎమ్మెల్యే విస్మరిస్తే.. తెలుగు తమ్ముళ్లు అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల వద్ద గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్‌ను కూటమి ప్రభుత్వం ఎత్తేసింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అక్కడున్న 8,644 మెట్రిక్ టన్నుల ఇసుకను ఎమ్మెల్యే అండ చూసుకుని తెలుగు తమ్ముళ్లు టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సదరు కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని తెలుస్తోంది. అక్కడున్న స్టాక్ పాయింట్‌ను ఎత్తేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇసుక కోసం పడుతున్న బాధలు వర్ణనాతీతం.

**చెప్పేదొకటి.. చేసేదొకటి**

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని వేదికలపై మాట్లాడే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆచరణలో తద్భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఆయన మాటలకు.. చేతలకు పొంతన ఉండటం లేదు. ఎన్నికల సమయంలో తనకు సహకరించని వారిని లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అక్రమ మైనింగ్ పేరిట వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రణీత్‌కుమార్‌రెడ్డిపైన, ఫోర్జరీ సంతకాల పేరుతో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా కుటుంబ సభ్యులపైన, డ్వాక్రా నిధుల గోల్‌మాల్ అంటూ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవిపైన, అధిక వడ్డీల పేరుతో సుల్తాన్ అనే ముస్లిం యువకుడిపైన.. ఇలా ఎంతోమందిపై అక్రమ కేసులు బనాయించారని చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారన్న కోపంతో రియల్ ఎస్టేట్ వెంచర్లలోని ప్లాట్లను జేసీబీలతో దున్నేశారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అభివృద్ధిపై దృష్టి సారించాలి



వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదు. ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించడం తప్ప చేసిందేమీ లేదు. అధికార టీడీపీ నాయకులే విమర్శిస్తున్నారంటే వంద రోజుల పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కక్షసాధింపులను వీడి అభివృద్ధిపై దృష్టి సారిస్తే సంతోషిస్తాం. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు.
–వేమయ్య యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

### హామీల అమలుపై ఉద్యమిస్తాం



ప్రతి ఏటా రైతులకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచారు. ఇప్పటి దాకా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఖరీఫ్ సీజన్ దాటిపోతోంది. రైతు సంఘం ఆధ్వర్యంలో త్వరలోనే ఉద్యమాలకు దిగుతాం. ఈ ప్రభుత్వ కళ్లు తెరిపిస్తాం. వంద రోజుల్లో పింఛన్లు మినహా ఇంకేమీ చేయలేదు.
–బడా సుబ్బిరెడ్డి, సీపీఎం నాయకులు

### వంద రోజుల్లో ఒరిగిందేమీ లేదు



మతతత్వ బీజేపీతో జతకట్టిన ఈ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. ఇది మోసకారి ప్రభుత్వం. నియోజకవర్గంలోఒక్క అభివృద్ధి కార్యక్రమమూ జరగలేదు. వంద రోజుల వంచన పాలనపై ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుపతి లడ్డూలో నాణ్యత లోపించిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ముందుకు రావాలి.
– అక్బర్‌ఖాన్, ఎంఐఎం, కదిరి ఇన్‌చార్జ్

### వంద రోజులు వంచన



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులైన సందర్భంగా వారు 'మంచి ప్రభుత్వం' పేరుతో సంబరాలు చేసుకుంటున్నారు. ఇది వందరోజుల వంచన ప్రభుత్వం. అన్ని వర్గాల ప్రజలనూ ముంచిన ప్రభుత్వం. అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలను మోసగించారు. కదిరిలో మా పార్టీ నాయకులు, పార్టీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎన్నికల్లో సహకరించలేదని కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.
–మక్బుల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కదిరి

---

### పోలీసుల సంక్షేమానికి కృషి

పుట్టపర్తి టౌన్: పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఈశ్వరయ్య, గోవిందు, షౌకత్‌అలీ ఎస్పీని కలసి పోలీసుల సమస్యలను విన్నవించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో చనిపోతే తక్షణ సాయం కింద రూ.25వేలు, ఫ్లాగ్‌ఫండ్ కింద రూ.25వేలు, విడో ఫండ్ కింద రూ.50వేలు గతంలో మూడు విడతలుగా అందజేసేవారని, ఈ సహాయాన్ని ఒకేసారి రూ.లక్ష అందజేసేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఇసుక అక్రమ రవాణా అరికట్టండి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తనకల్లు: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు సోమవారం వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పాపాగ్ని నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరఫరా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రెడ్డెప్ప, శ్రీనివాసులు, రమణ, రవీంద్రానాయక్, మురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీల్లో సత్తా చాటిన 'బ్లూమూన్' విద్యార్థులు

కదిరి అర్బన్: స్కూల్ గేమ్స్ పోటీల్లో పట్టణంలోని బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వివిధ విభాగాల్లో మొత్తం 29 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ పేర్కొన్నారు. నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల సంక్షేమానికి కృషి

పుట్టపర్తి టౌన్: పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఈశ్వరయ్య, గోవిందు, షౌకత్‌అలీ ఎస్పీని కలసి పోలీసుల సమస్యలను విన్నవించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో చనిపోతే తక్షణ సాయం కింద రూ.25వేలు, ఫ్లాగ్‌ఫండ్ కింద రూ.25వేలు, విడో ఫండ్ కింద రూ.50వేలు గతంలో మూడు విడతలుగా అందజేసేవారని, ఈ సహాయాన్ని ఒకేసారి రూ.లక్ష అందజేసేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**అడిషనల్ ఎస్పీని కలిసిన పోలీసు అధికారుల సంఘం సభ్యులు**

పుట్టపర్తి టౌన్: అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులును సోమవారం పోలీసుల అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, గోవిందు, షౌకత్ అలీ మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసుల సంక్షేమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి


వైద్య పరీక్షలు చేయించుకొంటున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తిలో జానకిరామయ్య కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరం ప్రారంభించారు. ఆమె కూడా వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాదతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

**195 చెరువులూ నింపుతాం**

పుట్టపర్తి: నియోజకవర్గంలో ఉన్న 195 చెరువులను హంద్రీ–నీవా నీటితో నింపేందుకు కట్టుబడి ఉన్నామని, ఈ దిశగా ఇప్పటికే జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చించామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే మామ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి బుక్కపట్నం మండలం పాముదుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బుక్కపట్నం చెరువుతో పాటు మారాల ఇతర చెరువులను హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలలో నింపుతామని పునరుద్ఘాటించారు.

## పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం


తంబాపురంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగి

బత్తలపల్లి: పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు, స్థానికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి..స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చునన్నారు. కాలువలల్లో చెత్తా చెదారం వేయవద్దని సూచించారు. తమ నివాస ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవేది గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఓంకారేశ్వరస్వామికి పూజలు

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రధాన అర్చకులు కేశవస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివనామస్మరణతో హోరెత్తించారు.

### శ్మశానవాటికలకు స్థలాలు గుర్తించండి

గాండ్లపెంట: గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానవాటిక కోసం వచ్చే అర్జీలను స్వీకరించి అనువైన స్థలాలు గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం రెక్కమాను గ్రామ సచివాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన స్టిక్కర్లు ఆవిష్కరించారు. అనంతరం గాండ్లపెంట పంచాయితీ కొట్లపల్లి నుంచి పాతవాండ్లపల్లి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

### ఏఈని నియమించాలి

కనగానపల్లి: విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)ను నియమించాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ నాయకుడు మహదేవ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో విద్యుత్ సమస్యలపై తహసీల్దార్ రమాదేవి వినతిపత్రం అందజేశారు. మండలంలో రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రైతులు, సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి వెంటనే రెగ్యులర్ ఏఈని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కారదర్శి బాలరాజు, రైతు సంఘం అధ్యక్షుడు పసల నాగరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

అమడగూరు: మండలంలో మంగళవారం నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి వెంకటరమణాచారి పేర్కొన్నారు. డిసెంబర్ 31 వరకూ ప్రతి మంగళ, బుధవారాల్లో ఆర్‌ఎస్‌కే సిబ్బంది ద్వారా ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అధికారులు పాల్గొని రైతులకు పంటల సాగుపై మెలకువలు, అధిక దిగుబడి సాధించడానికి సూచనలు ఇస్తారన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం


గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: క్రీడలతో క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓబుళమ్మ అన్నారు. ఈనెల 20 నుంచి 21 వరకు మండల స్థాయిలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్, చెస్ యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించిన విషయం విదితమే. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మండలానికి చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో గెలిచిన వారు నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు నల్లప్ప, విజయ నిర్మల, అంజన్న, కుమార్ రాజ, కుసుమ, కొండమ్మ పాల్గొన్నారు.

**నేడు మండల స్థాయి క్రీడా పోటీలు**

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. సోమవారం క్రీడా పోటీల నిర్వహణపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వారీగా ఎంపిక చేసిన క్రీడాకారులందరూ పాల్గొనాలని పీడీ రమేష్ సూచించారు. క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు.

### బీరువా, మైక్‌సెట్ వితరణ

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం తమవంతుగా మైక్ సెట్‌తో పాటు బాలికల ఉన్నత పాఠశాలకు బీరువాను వితరణ చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మైక్‌సెట్, బీరువా అందజేశారు. వీరిని ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర, రమాదేవి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, ఉమాదేవి, బాబ్జాన్, విద్యార్థులు ఫక్ృద్దీన్, జగన్, రామానాయుడు, మౌళి, చంద్రకళ, శివమ్మ, శ్రీదేవి, మునిస్వామి, భీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎన్పీకుంట: పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సీడీపీఓ రాధిక తెలిపారు. ఎస్.రెడ్డివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నరసమ్మ, లక్ష్మీదేవి, మౌలాబి, ఉపాధ్యాయుడు రామ్మోహన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు బాలింతలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486